విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పోటీలు


ప్రశంసాపత్రాలతో చిన్నారులు

బోడుప్పల్: సన్‌ఫైటర్స్ కుంగ్‌ఫూ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం బోడుప్పల్ దేవేందర్‌నగర్‌లోని శౌర్యస్కూల్‌లో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పోటీలు నిర్వహించినట్లు కరాటే మాస్టర్ నందప్రసాద్‌యాదవ్ తెలిపారు. ఈ పోటీల్లో జగత్ బ్లాక్‌బెల్ట్, వరుణ్ బ్రౌన్ బెల్ట్, వేదాంత, నిహారిక, హర్ష గ్రీన్ బెల్ట్‌లు, విఘ్నేష్, అనిరుధ్, ఉపేక్ష, ప్రణవి, తేజస్విని, పృథ్వీ ఆరెంజ్‌బెల్ట్‌లు సాధించారు. వీరికి నందప్రసాద్‌యాదవ్ సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

బోడుప్పల్: మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కృషిచేయాలని 13వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దానగల్ల అనితయాదగిరి అన్నారు. రాజీవ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో మహిళాదినోత్సవం సందర్భంగా బతుకమ్మ వేడుకలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన


కూచిపూడి నృత్య ప్రదర్శనతో చిన్నారులు

ఉప్పల్: మినీ శిల్పారామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం యుక్తారెడ్డి శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కోమలాల, లలిత హారతి, గరుడ గమన, జతిస్వరం, దశావతారం, బృందావన నిలయే, మహాగణపతిం, మూషికవాహన తదితర అంశాలను నేహా, శాన్వి, కృతిక, అక్షయ, రూప, అన్విక, రుహిక, ప్రియ, షణ్ముఖ, ప్రావీణ్యాలు ప్రదర్శించి మెప్పించారు.

కార్పొరేటర్ పర్యటన

కుషాయిగూడ: కృష్ణానగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని స్థానిక కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ తెలిపారు. ఆదివారం కాలనీలో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరించేలా ముందుకెళ్తున్నామని చెప్పారు. కిష్టారెడ్డి, బాలరాజు, బ్రహ్మచారి, అనంతచారి, ఎంఎస్ఎన్ మూర్తి, శ్రీనివాస్, అంజయ్యగౌడ్, జయమ్మ, సుజాత, దండెం నరేందర్ తదితరులున్నారు.

'ధీర' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణలో వాసుదేవశర్మ తదితరులు

ఉప్పల్: ఉప్పల్‌లోని ఐ ఫోకస్ సుజనాలయంలో ఆదివారం 'ధీర' పుస్తకాన్ని ఐ ఫోకస్ మిషన్ కుప్ప వాసుదేవశర్మ ఆవిష్కరించారు. అనుకున్నది సాధించే వరకు పట్టుదలతో ఎన్ని అవాంతరాలు ఎదురైన వాటిని ఎదుర్కొని నిలబడగలిగే వారే ధీరులని వాసుదేవశర్మ అన్నారు. ఉన్నత ఆశయంతో ముందుకుకెళ్తేనే విజయాలు వరిస్తాయని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ధీర పుస్తకంలో 126 మంది ధీరుల కథలతో రచించిందే ఈ పుస్తకం అన్నారు. ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం అన్నారు. రచయితలు జలంధర చంద్రమోహన్, మంథా భానుమతి, డా. మంజుల, గంటి భానుమతి, స్వాతి, శ్రీపాద, కార్టునిస్ట్ నెల్లుట్ల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళా జాబ్ మేళాకు విశేష స్పందన


జాబ్‌మేళా నిర్వహించిన కంపెనీ ప్రతినిధులు

కీసర: కీసర పరిసర ప్రాంత మహిళల కోసం కీసరలో నాయకపు మాధురి వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 'మహిళా జాబ్ మేళా'కు విశేష స్పందన లభించింది. రంగారెడ్డి జిల్లాలోని కొంగరకలాన్, తుక్కుగూడ ప్రాంతాలకు చెందిన ప్రముఖ బహుళ జాతీయ సంస్థలు పాల్గొన్నాయి. 18 ఏళ్లు వయస్సు కలిగి, టెన్త్, ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిలైన మహిళలు జాబ్ మేళాకు హాజరయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 15 వేలతో పాటు అటెండెన్స్ బోనస్, భోజనం , ఏసీ బస్సు సౌకర్యం, పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నైట్ షిఫ్ట్ అలవెన్స్, ఓటీ చేస్తే డబుల్ వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఎంపికైన మహిళలకు నియామకపత్రాలు అందజేశారు.

వసూళ్లపై ఫోకస్ !


బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయం

ఆస్తిపన్ను వసూలు కోసం స్పెషల్ డ్రైవ్

- బకాయిలు రూ.31.64 కోట్లు
- ఇప్పటి వరకు వసూలైంది రూ.21.11 కోట్లు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు 2024–2025 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వసూలు చేసేందుకు దృష్టి సారించారు. దీనిలో భాగంగా స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. మొత్తం డిమాండ్ రూ 31.64 కోట్లు ఉండగా.. ఇప్పటి వరకు 66.72 శాతం పన్ను వసూలైనట్లు మున్సిపల్ రికార్డుల ద్వారా తెలుస్తోంది.

పన్ను చెల్లించని వారి ఆస్తులు జప్తు..

స్పెషల్‌డ్రైవ్ టీమ్ పన్ను బకాయిదారుల ఇళ్లకు వెళ్లి 'ఆస్తిపన్ను చెల్లించండి... అభివృద్ధికి సహకరించండని' కోరుతున్నారు. ఆస్తిపన్ను చెల్లించని వారి ఆస్తులను జప్తుచేసేందుకు సైతం సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగానే ప్రత్యేకంగా జప్తు వాహనాన్ని ఏర్పాటు చేశారు.

ఈ ఏడాది రూ.56.79 లక్షల ఆదాయం..

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం అసెస్‌మెంట్స్ చేసిన ఇళ్లు 36,076 ఉండగా.. ఆస్తిపన్ను 2024– 2025 ఆర్థిక సంవత్సరం డిమాండ్‌మొత్తం రూ. 31.64 కోట్లు ఉంది. ఇప్పటి వరకు రూ.21.11 కోట్లు వసూలైంది. 66.72 శాతం వసూళ్లు కాగా మిగతా బకాయిలను ఈనెల 31వతేదీ వరకు వసూలు చేసేందుకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్ కింద 2,151 షాపులు ఉండగా వాటి ద్వారా ఆదాయం రూ. 96.65 లక్షలు వస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం రూ.56.79 లక్షలు మాత్రమే వసూలైంది.

పన్ను వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ టీమ్..

ఆస్తిపన్ను వసూళ్లకు చెంగిచర్ల 3 టీమ్స్, బోడుప్పల్‌లో 9 టీమ్స్‌ను ఏర్పాటు చేశారు. అలాగే ఆస్తిపన్ను బకాయిల వసూలు కోసం ప్రత్యేక మొబైల్‌టీమ్ (జప్తు వాహనం)ను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లో కమిషనర్, రెవెన్యూ ఆఫీసర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, బిల్ కలెక్టర్ ఉన్నారు. జప్తు వాహనంపై ఆస్తిపన్ను, బకాయిలు చెల్లించని యెడల మున్సిపల్ చట్టం-2019 ప్రకారం జప్తు చేస్తామని ప్రచారం చేస్తున్నారు.

100 శాతం వసూలుకు కృషి..



2024–25 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను 100 శాతం వసూలు చేసేందుకు కృషి చేస్తున్నాం. స్పెషల్ డ్రైవ్ టీమ్ బకాయిదారుల ఇంటింటికీ వెళ్లి పన్ను వసూలు చేస్తున్నారు. మొదట రెడ్ కార్న్ నోటీసు జారీచేసి వారం రోజుల పాటు చూసి, స్పందించకపోతే డ్రైనేజీ, వాటర్ కనెక్షన్ తొలగించి ఆస్తులు జప్తు చేస్తాం.

– శైలజ, బోడుప్పల్, కమిషనర్

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత


యోగా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

అల్వాల్: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత పొందగలుగుతామని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఓల్డ్ అల్వాల్‌లోని హైటెన్షన్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన సోల్ ఫ్యూయల్ యోగా వెల్నెస్ సెంటర్‌ను ఆదివారం ఎంపీ ఈటల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత జీవనశైలిలో క్షణం తీరిక లేకుండా పోయిందని, బిజీబిజీగా గడిపేవారికి యోగా, ధ్యాన కేంద్రాలతో ఎంతో ప్రశాంతత పొందుతారని తెలిపారు. యోగా కేంద్రాలు వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావంతో కొనసాగించాలని సూచించారు. కార్పొరేటర్ రాజీజితేంద్రనాథ్, యోగాచార్య మల్లేష్, పూర్ణసాయి, విజయ్ కుమార్, వీరేశం, ఆనంద్, మల్లారెడ్డి, మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం

రేపు పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన


సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీదేవి, రజిత

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉప్పల్ వార్డు కార్యాలయంలో కార్పొరేటర్లు రజితాపరమేశ్వర్‌రెడ్డి, బొంతు శ్రీదేవితో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 11న ఉప్పల్ డివిజన్‌లో రూ.43.27 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే డివిజన్‌తో పాటు నియోజకవర్గంలో స్థానిక సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఉప్పల్ డివిజన్‌లో రూ.240 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఉప్పల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. టీపీసీసీ ప్రతినిధి తౌఫిక్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంది ఆగిరెడ్డి, కృష్ణారెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు ఆకారపు అరుణ్, బాకారం లక్ష్మణ్, గిరిబాబు, రఘుపతిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణే వ్యాపారాభివృద్ధికి దోహదం


ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు, డీసీ ఆంజనేయులు

ఉప్పల్: వ్యాపారస్తులు చిన్న మధ్యతరహారంగం అభివృద్ధికి కృషిచేయాలని, పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ మాజీ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఉప్పల్‌లో వాసుదేవ కో–ఆపరేటివ్ సొసైటీ రెండో బ్రాంచ్‌ను ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజాదరణ, నమ్మకమే వ్యాపారాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సంస్థ మరిన్ని శాఖలను ఏర్పాటుచేసి అత్యధిక కుటుంబాల అభివృద్ధికి చేయూతను ఇవ్వాలని సూచించారు. సొసైటీ చైర్మన్ కావూరి రామారావు మాట్లాడుతూ.. ఫస్ట్ బ్రాంచ్ జీడిమెట్ల, రెండో బ్రాంచ్‌ను ఉప్పల్‌లో ప్రారంభించామన్నారు. 500 కుటుంబాలకు రూ.2 కోట్ల వరకు రుణాలను అందజేసి, తోడ్పాటును అందించినట్లు చెప్పారు. డీసీవో వెంకటరెడ్డి, డా. విక్రమ్‌కుమార్, రామయాదవ్, మల్లికార్జునరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


హాస్టల్ యజమానిపై ఎక్సైజ్ పోలీసుల దాడి

పోచారం పీఎస్‌లో బాధితుడి ఫిర్యాదు


వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

పోచారం: ఓ ఫంక్షన్ హాల్ సెక్యూరిటీ సిబ్బందికి, సమీపంలోని ఓ హాస్టల్ నిర్వాహకుడు మధ్య జరిగిన వాగ్వాదంలో ఎక్సైజ్ పోలీసులు జోక్యం చేసుకోవడంతో వివాదం పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. చౌదరిగూడలోని సీబీఎస్ ఫంక్షన్ హాల్‌లో యువకులు పటాకులు కాలుస్తుండగా పక్కనే ఉన్న స్వాతిరెడ్డి బాలికల హాస్టల్‌లో పడ్డాయి. దీంతో బాలికలు భయభ్రాంతులకు గురయ్యారు. పటాకులు కాల్చేవారిని మందలించాలని ఫంక్షన్ హాల్ సెక్యూరిటీ సిబ్బందిని హాస్టల్ యజమాని రాజిరెడ్డి కోరారు. ఇంతలో ఎక్సైజ్ పోలీసులు అక్కడికి చేరుకోవడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఎక్సైజ్ పోలీసులు రాజిరెడ్డిని వాహనంలో కూర్చోబెట్టడంతో హాస్టల్ బాలికలు ఆందోళన చేపట్టారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోచారం పీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు. విధులకు ఆటంకం కలిగించారని రాజిరెడ్డిపై ఎక్సైజ్ పోలీసులు, అకారణంగా తన చొక్కా పట్టుకుని లాక్కెళ్లారని ఎక్సైజ్ సీఐ జూపల్లి రవి, మరో నలుగురు సిబ్బందిపై రాజిరెడ్డి పోచారం పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

నాగారంలోని ఓల్డ్ విలేజ్‌లో చోరీ



కీసర: నాగారంలోని ఓల్డ్ విలేజ్‌లో శనివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. నాగారం ఓల్డ్ విలేజ్‌కు చెందిన ప్రదీప్ తన తల్లితో కలిసి పడమటిసోమారం గ్రామానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు తాళాలు పగలగొట్టి 16 తులాల బంగారు ఆభరణాలు, 40 తులాల వెండి, రూ. 20 వేల నగదు అపహరించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రివేళ పోలీసులు గస్తీ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కుషాయిగూడ: నియోజకవర్గంలో తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ కృష్ణారెడ్డి నగర్ కాలనీ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అధ్యక్షుడిగా వెంకటేష్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌నాయక్ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

ఘనంగా మల్లికార్జున స్వామి జాతర



పోచారం: కాచవానిసింగారంలోని మల్లికార్జునస్వామి, రేణుకా ఎల్లమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణాలు, గొలుసు తెంపుట, అగ్నిగుండాలు, వీరబోనం, పటం ఎక్కుట వంటి కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రరావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, నిర్వాహకులు ఎం.భద్రారెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

లైంగికదాడి నిందితులను శిక్షించాలి


నాచారంలో సీఐటీయూ నేతల నిరసన

కాప్రా: జగిత్యాలలో ఆశావర్కర్‌పై లైంగికదాడికి పాల్పడిన నిందితులను తక్షణమే గుర్తించి కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాచారం డివిజన్ కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. ఆదివారం నాచారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగిత్యాలలో దళిత ఆశావర్కర్ విధులు ముగించుకుని తిరిగి ఇంటికెళ్లే సమయంలో కొందరు వ్యక్తులు లైంగికదాడికి పాల్పడిన ఘటన యావత్ దేశం తలదించుకునే పరిస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేరోజు బాధితురాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, ఎలాంటి విచారణ చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాల్‌రాజ్, నరేష్, నర్సింహ, ఎల్లేష్, మల్లేష్, చిన్న, ప్రభాకర్, శ్రీనివాస్, వెంకట్, కనకయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేద్దాం



బోడుప్పల్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేద్దామని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల డైరెక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చెంగిచర్లలో విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుతున్న విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు బోధన చేయాలన్నారు. విద్యాసంస్థ మరెన్నో మైలురాళ్లను అధిరోహించాలన్నారు. విద్యార్థులు చేసిన పలు నృత్యాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. రాజు, స్థానిక నేతలు రవిగౌడ్, రంగ బ్రహ్మన్నగౌడ్, కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్, గోపాల్‌గౌడ్, డైరెక్టర్లు అయ్యంగార్, వరప్రసాద్, ప్రిన్సిపాల్ నీలిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గాయత్రీదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి స్థానిక నేతలు

బోడుప్పల్: గాయత్రినగర్ కాలనీలో గాయత్రీదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులచే మండపపూజలు, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, యంత్రస్థాపన, జీవన్యాసం, ప్రాణప్రతిష్ఠ కళాహోమాలు, బలిహరణ మహాపూర్ణాహుతి, కలశఉద్వాసన, అగ్ని కుంభాభిషేకం, వేదమాత గాయత్రీమాత దర్శనం ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు మంద సంజీవ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు రాంచంద్రారెడ్డి, కొత్త రవిగౌడ్, కొత్త చక్రపాణిగౌడ్, కీర్తనరెడ్డి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వకర్మ సంఘం నూతన కమిటీల ఏర్పాటు



రామంతాపూర్: ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు బ్రహ్మచారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు మదన్‌మోహన్‌చారి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు భిక్షపతిచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుచారి, గ్రేటర్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారి, ప్రచార కార్యదర్శి రాములుచారి, కోశాధికారి శ్రీనివాస్‌చారి, ఉప్పల్ కోశాధికారి గోపిచారి, గ్రేటర్ హైదరాబాద్ మహిళా ప్రధాన కార్యదర్శి కవితాచారి పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు మదన్‌మోహన్‌చారి మాట్లాడుతూ.. గ్రేటర్‌లో ఉన్న అన్ని నియోజకవర్గాలకు కమిటీలు వేసి ఐక్యత చాటుకుందామన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



మేడ్చల్: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని పీవీ(పాపరాయ విద్యానికేతన్) స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నిర్వహించిన పలు కార్యక్రమాలు అలరించాయి. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికానర్సింహ్మారెడ్డి, సత్యనారాయణ, పట్టణ బీజేపీ అధ్యక్షురాలు శైలజ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మరింత చేరువ..!

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో టెలీమెడిసిన్ సేవలు

- మల్కాజిగిరి ప్రభుత్వాసుపత్రితో సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు అనుసంధానం
- సేవలు పొందుతున్న రోగులు
- ఉస్మానియా, గాంధీ, నిమ్స్ నుంచి సైతం సేవలు



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రవేశపెట్టిన టెలీమెడిసిన్‌తో జిల్లా ప్రజలకు వైద్యసేవలు మరింత చేరువయ్యాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రితో రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 12 సీహెచ్‌సీలు, 24 యూపీహెచ్‌సీలు అనుసంధానం చేశారు. టీవీ, కంప్యూటర్ ద్వారా రోగులను పరీక్షించి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

◆ జిల్లావ్యాప్తంగా 24 యూపీహెచ్ఎస్, 4 పీహెచ్‌సీలు, ఒక ఏరియాసుపత్రి, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అనుసంధానం చేశారు.

◆ అలాగే హైదరాబాద్‌లోని ఉస్మానియా, నిమ్స్, గాంధీ ప్రభుత్వాసుపత్రులకు మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వాసుపత్రిని అనుసంధానం చేశారు.

◆ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు చెందిన 40 ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల నుంచి కూడా రోగులు ఇక్కడి సేవలు పొందేలా ఏర్పాటు చేశారు.

◆ అన్ని కేంద్రాల్లో టెలీ మెడిసిన్ సేవలు నిరంతరం కొనసాగుతున్నాయని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ .రఘునాథ్‌స్వామి పేర్కొన్నారు.

ఈ ప్రాంతాల్లో టెలీమెడిసిన్ సేవలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఘట్‌కేసర్, మేడ్చల్ కమ్యూనిటీహెల్త్ సెంటర్లు, మూడుచింతలపల్లి, శామీర్‌పేట, కీసర, జవహర్‌నగర్, కుషాయిగూడ, శ్రీరంగవరం, నారపల్లి, ఉప్పల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, బాలానగర్, అల్వాల్ పీహెచ్‌సీలతో పాటు మచ్చబొల్లారం, సుభాష్ నగర్, పర్వతానగర్, మూసాపేట్, జగద్గిరిగుట్ట, ఎల్లమ్మబండ హంసపేట్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్, గాజులరామారం సూరారంకాలనీ, వినాయకనగర్, ఏకలవ్యనగర్, మౌలాలీ, సఫిల్‌గూడ, మల్లాపూర్, వెంకట్‌రెడ్డినగర్, నాగోల్, కొత్తపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ, చర్లపల్లి, పేట్‌బషీరాబాద్ యూహెచ్‌సీలకు చెందిన రోగులు మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రి సమన్వయంతో ప్రత్యేకసేవలు వినియోగించుకుంటున్నారు.

సమన్వయంతో సేవలు..

అనారోగ్య సమస్యలతో ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలను సంప్రదిస్తున్న రోగులను అక్కడి వైద్యులు పరీక్షిస్తున్నారు. వారికి నిపుణుల సేవలు అవసరమైతే వెంటనే మల్కాజిగిరి జిల్లా ఆసుపత్రి టెలీ మెడిసిన్ వైద్యులను సంప్రదిస్తున్నారు. ప్రతీరోజు ఉదయం 9 నుంచి పేర్లు నమోదు చేస్తూ.. మధ్యాహ్నం 2 వరకు సేవలందిస్తున్నారు.

◆ ప్రధాన ఆస్పత్రి నుంచి నేరుగా ప్రత్యేక వైద్యనిపుణులు టీవీ, కంప్యూటర్ ద్వారా పీహెచ్‌సీలకు అనుసంధానం చేసిన ట్యాబ్, టీవీ, కంప్యూటర్లో రోగితో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారు. తర్వాత స్థానిక వైద్యాధికారికి సలహాలు, సూచనలు అందిస్తూ చికిత్స అందిస్తున్నారు.శస్త్రచికిత్స అవసరమైన వారిని రిఫర్ చేయాలని సూచిస్తున్నారు. ఇలా ప్రాణాంతక రోగాలను ప్రాథమిక దశలోనే నియంత్రిస్తున్నారు.

జిల్లాలో లేని సేవలకు హైదరాబాద్ నుంచి..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అవకాశం లేని ఎండోక్రైనాలజీ, కార్డియాలజీ, న్యూరాలజీ, సైక్రియాటిక్ నెఫ్రాలజీ అంకాలజీ, పల్మనాలజీ, సైకోథెరపీ విభాగాలకు చెందిన నిపుణులు హైదరాబాద్‌లోని ఉస్మానియా, నిమ్స్, గాంధీ ఆస్పత్రుల నుంచి టెలీ మెడిసిన్ సేవలను అందిస్తున్నారు.

వైద్య నిపుణులతో రోజువారీ సేవలు..

టెలీ మెడిసిన్ సేవలందించే వైద్య నిపుణులు వారంలో ఒకరోజు అందుబాటులో ఉండేలా షెడ్యూల్ రూపొందించారు.

సోమవారం	– డెర్మటాలజీ, గైనకాలజీ
మంగళవారం	– ఆప్తామాలజీ, ఈఎన్‌టీ
బుధవారం,	– జనరల్, మెడిసిన్
గురువారం	– పీడియాట్రిక్, జనరల్ సర్జన్, గైనకాలజీ
శుక్రవారం	– గైనకాలజీ
శనివారం	– ఆర్థోపెడిక్